# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

సోమవారం | 28 ఏప్రిల్ 2025 | పేజీలు 8





- దుండిగల్ మండలం బౌరంపేట్ సర్వే నెం. 524, 525, ,567 కన్జర్వేషన్ జోన్..
- 2022 మార్చి 7న..! 2025 మార్చి 6న హెచ్ఎండిఏ ల్యాండ్‌యూస్ ఇన్ఫర్మేషన్..
- హద్దుమీరి సహకరిస్తున్న దుండిగల్ టౌన్‌ప్లానింగ్ వ్యవస్థ..
- మేడ్చల్ జిల్లా లోకల్‌బాడీ అదనపు కలెక్టర్ నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు..
- జిల్లా విద్యాశాఖ అధికారి(డీఈఓ) గుడ్డిగా సహకారం.. ముడుపులకే ప్రధాన్యత..

# కన్జర్వేషన్ జోన్‌లో...
# కార్పోరేట్ పాఠశాల

## నిర్మాణాలు నిషేధించిన చోటనే.. బౌరంపేట్ "వ్యాసా స్కూల్" బరితెగింపు..

- దుండిగల్ మున్సిపాలిటీలో అనుమతిలేని కార్పోరేట్ పాఠశాలలకే ప్రాధాన్యత..
- ఓవైపు టౌన్‌ప్లానింగ్ పర్మిషన్ లేదు..! మరోవైపు ఆస్తి పన్ను చెల్లింపులు లేవు..!
- అసలు నిర్మాణాలే నిషేధించిన కన్జర్వేషన్ జోన్‌లో కార్పోరేట్ విద్యాసంస్థ నిర్వహణ..
- వ్యవసాయం చేయాలి..! మొక్కలు మాత్రమే నాటాల్సి చోట పాఠశాల నిర్వహణ..
- విద్యార్థులను ప్రమాదంలో పెడుతున్న కార్పోరేట్ విద్యాసంస్థలు..
- పలుకుబడితో పాటు పైసలు పంచే సత్తా..! కార్పోరేట్ విద్యాసంస్థల కథాకామామీషు..!

-2లో



బౌరంపేట్ కన్జర్వేషన్ జోన్‌లో అక్రమ నిర్మాణంలో "వ్యాసా" పాఠశాల..



బౌరంపేట్ సర్వే నెం.524, 525, 567 కన్జర్వేషన్ జోన్‌లో అక్రమంగా నిర్వహిస్తున్న వ్యాసా పాఠశాల..

అసలు నిర్మాణాలే చేపట్టకూడని కన్జర్వేషన్ జోన్‌లలో అక్రమ కట్టడాలు, ఆపై కార్పోరేట్ విద్యాసంస్థ పాఠశాల నిర్వహణకు..! ఇటు మున్సిపల్ అధికారులు, అటు విద్యాశాఖ అధికారి బరితెగించి సహకరిస్తున్నారు.. కార్పోరేట్ విద్యాసంస్థల నుండి ముడుపులు దండుకుని, రెండు శాఖల యంత్రాంగం విద్యార్థులను రిస్కులో పెడుతున్నారు.. చట్టాలను నిర్వీర్యం చేస్తూ, నిబంధనలు విస్మరిస్తున్నారు.. అక్రమార్కుల కోసమే ఈ కార్యాలయాలు తెరిచారా అన్న ఆరోపణలు లేకపోలేదు.. బౌరంపేట్ గ్రామ పరిధిలోని కన్జర్వేషన్ జోన్‌లో అక్రమ కట్టడాలతో "వ్యాసా స్కూల్" నిర్వహిస్తున్న యాజమాన్యానికి, దుండిగల్ మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ వ్యవస్థ దాసోహం అంటుండగా..! జిల్లా విద్యాశాఖ అధికారులు బహిరంగంగానే బరితెగించి వ్యవహరిస్తున్నారు.. నిర్మాణాలు నిషేధించిన చోట అక్రమ కట్టడాలు చేపడుతుంటే..! తానా తందానా అంటూ విద్యాశాఖ సహకరిస్తుంది.. వార్తలు వచ్చినా పట్టించుకోకుండా లంచావతారులుగా వ్యవహరిస్తున్న మున్సిపల్, విద్యాశాఖ అధికారుల తీరుపై పెన్ పవర్ ప్రత్యేక కథనం..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఏప్రిల్ 27:**

## బౌరంపేట్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలు..



- గులాబీ జెండాను ఎగురవేసిన బౌరంపేట్ బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి..
- గులాబీ దళంతో కలిసి ఎల్కతుర్తి సభకు బయలుదేరిన బీఆర్ఎస్ నేతలు..
- గండిమైసమ్మ చౌరస్తాలో ఎమ్మెల్సీతో కలిసి జెండా ఎగురవేసిన శ్రీనివాస్ రెడ్డి..
- సభకు వెళ్ళే మార్గంలో మాజీ మంత్రి హరీష్‌రావును కలిసిన గులాబీ నేతలు..

-3 లో

## ఇందిరమ్మ ఇంటి దరఖాస్తుదారుల్లో..
# 53% మంది అనర్హులే..

41.15 లక్షల మందికి అర్హత లేదు..

36.03 లక్షల మంది మాత్రమే అర్హులు



-6 లో

# కన్జర్వేషన్ జోన్‌లో.. కార్పోరేట్ పాఠశాల..










వార్తలు వచ్చినా చర్యలు శూన్యం..





**హెచ్ఎండిఏకి దరఖాస్తు చేసుకున్న స్కూల్ నిర్వహకులకు, అనుమతులు నిరాకరించారు. కన్జర్వేషన్ జోన్‌గా హెచ్ఎండిఏ రెండు సార్లు (2022 మార్చి 7న- 2025 మార్చి 6న) ల్యాండ్ యూస్ ఇన్ఫర్మేషన్‌లో కన్జర్వేషన్ జోన్‌గా నిర్ధారించిన హెచ్ఎండిఏ.. అయినప్పటికీ బరితెగించి పలుకుబడితో పాఠశాల నిర్వహించడం విద్యార్థులను ప్రమాదంలో పెట్టడమే.. ఇంత జరుగుతున్నా అనుమతులు ఉన్నాయని, కన్జర్వేషన్ జోన్ కన్వర్శన్ చేశామని వ్యాసా స్కూల్ యాజమాన్యం మబ్బపెట్టడం విశేషం.. కన్జర్వేషన్ స్థలం క్లియర్ చేయాలంటే కనీసం ప్రిన్సిపల్ సెక్రటరీ స్థాయిలో చేయాల్సి ఉంటుంది.. మరోవైపు హెచ్ఎండిఏ అనుమతులు ఇవ్వాలంటే 40 ఫీట్ల దారి లేకుండా సాధ్య పడదు..దుండిగల్ మున్సిపల్ అధికారులు, దుండిగల్ విద్యాధికారి ఏ విధంగా కార్పోరేట్ పాఠశాలలకు సహకరిస్తున్నారో జిల్లా కలెక్టర్ గమనించాలి..**

-

**మొదటి పేజి తరువాయి**

సిఫార్సులకే ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడేసేవిధంగా టౌన్‌ప్లానింగ్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటే..! విద్యాశాఖ అధికారులు లంచాలకు అలవాటు పడి, విధులు తాకట్టు పెడుతున్నారు.. మున్సిపల్ అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు..! ఫైర్ ఎన్‌వోసి లేకుండానే పాఠశాల నిర్వహణపై విద్యాశాఖ



VVYASA SCHOOL Journey to Knowledge

Vvyasa School Fee Structure and Admission Guidelines
AY 2025 - 26

| Fee Particulars | |
|---|---|
| Application Fee | 1000 |
| Admission Fee (Non Refundable) | 5000 |

Tuition Fee

| | Total | Term I 40% | Term II 35% | Term III 25% |
|---|---|---|---|---|
| Nursery | 89000 | 35600 | 31150 | 22250 |
| PPI - PPII | 124000 | 49600 | 43400 | 31000 |
| Grade I - Grade II | 128000 | 51200 | 44800 | 32000 |
| Grade III - Grade IV | 132000 | 52800 | 46200 | 33000 |
| Grade V - Grade VI | 136000 | 54400 | 47600 | 34000 |
| Grade VII - Grade VIII - Grade IX | 139000 | 55600 | 48650 | 34750 |

Transportation Fee

| Slab | Distance | Term I | Term II | Total |
|---|---|---|---|---|
| Slab I | 1 Km to 3 Km | 14000 | 14000 | 28000 |
| Slab II | 1 Km to 6 Km | 16000 | 16000 | 32000 |
| Slab III | 6 km to 9 km | 18000 | 18000 | 36000 |
| Slab IV | 9 km to 12 km | 20000 | 20000 | 40000 |
| Slab V | 12 km to 16 km | 22000 | 22000 | 44000 |

| School Lunch Fee | |
|---|---|
| Nursery | No Fee |
| PPI - PPII | 20000 |
| Grade I - Grade II | 22000 |
| Grade III - Grade IX | 24000 |

GPS tracking app is included.

| | Term I | Term II | Term III |
|---|---|---|---|
| Tution Fee | 1st March | 1st July | 1st November |
| Transport Fee | 1st June | 1st November | --------- |
| Lunch Fee | 15th June | --------- | --------- |

**నిర్మాణాలను నిషేధించిన చోట దర్జాగా అక్రమ నిర్మాణాలు.. బ్రోచర్‌లతో రేట్లు..**

అవగాహన రాహిత్యంతో బరితెగించి సహకరిస్తున్నారు..


దుండిగల్ మున్సిపల్ బౌరంపేట్ గ్రామంలోని కన్జర్వేషన్ జోన్‌లో "వ్యాసా స్కూల్" నిర్వహణపై స్థానికులు ఫిర్యాదు చేసినా, పత్రికల్లో వార్తలు వచ్చినా చర్యలు తీసుకోకుండా సహకరిస్తున్నారు.. నిర్మాణ అనుమతులకు అవకాశం లేని..! కన్‌జర్వేషన్ జోన్ వ్యవసాయ భూమిలో "వ్యాసా స్కూల్" యాజమాన్యం విద్యార్థులను ప్రమాదంలో పెడుతున్నారు..గతంలో బౌరంపేట్ వాసులు ఫిర్యాదు చేసి 4 నెలలు గడిచినా నేటికీ చర్యలు శూన్యం.. మరోవైపు వ్యాసా స్కూల్ యాజమాన్యం పత్రికల్లో వార్తలు రాసిన విలేఖరులపై కేసులు పెడతామని, ఇతర విలేఖరులతో బెదిరింపులకు పాల్పడే విధంగా చెప్పడం విశేషం..నిషేధిత స్థలం కన్జర్వేషన్ జోన్‌లో "వ్యాసా స్కూల్" అక్రమంగా నిర్వహిస్తుండటమే గాక, యాజమాన్యం బరితెగించి వ్యవహరించడం గమనార్హం..

## దుండిగల్ విద్యాధికారి బాధ్యతా రహితం..

బాధ్యతా యుతమైన విధుల్లో ఉన్న దుండిగల్ మండల విద్యాధికారి బాధ్యతా రహితంగా వ్యవహరిస్తున్నారు.. కార్పోరేట్ విద్యాసంస్థలకి బహిరంగంగానే సహకరిస్తున్నారని తేటతెల్లం అయింది.. బౌరంపేట్ లహరి గ్రీన్‌పార్క్ రోడ్డులోని రెసిడెన్షియల్ భవనంలో, కార్పోరేట్ విద్యాసంస్థ "నారాయణ హైస్కూల్" నిర్వహణ.. బౌరంపేట్ సర్వే నెం.524, 525, 567 కన్జర్వేషన్ జోన్‌లో "వ్యాసా పాఠశాల"కి మున్సిపల్ అండ్ విద్యాశాఖ అధికారులు రెండు అక్రమ పాఠశాలలపై చర్యలు తీసుకోకుండా బహిరంగంగానే సహకరిస్తున్నారు.. బౌరంపేట్ సర్వే నెంబర్ 567, 524, 525, మొత్తం కన్జర్వేషన్ జోన్‌లోనే ఉన్నాయని హెచ్ఎండిఏ వెల్లడించి.. ల్యాండ్ యూజ్ ఇన్‌ఫర్మేషన్‌తో సమాచారం తీసుకున్నారు, నిర్మాణ అనుమతులు కూడా తిరస్కరించినా "వ్యాసా స్కూల్" ఏ విధంగా కొనసాగుతుందో జిల్లా విద్యాధికారి,జిల్లా కలెక్టర్ తేల్చాలి.. మరో హాస్యాస్పద విషయం ఏమిటంటే దుండిగల్ విద్యాధికారి పెన్ పవర్ ప్రతినిధి ఫోన్ బ్లాక్‌లో పెట్టి సమాధానానికి దూరంగా ఉండటాన్ని ఏమంటారో..? ముడుపులే కారణమా..?

## కన్జర్వేషన్ జోన్ క్లియర్ అయిందని బుకాయింపు..!

సంబంధిత వ్యాసా స్కూల్ యాజమాన్యం.. పాఠశాల ఏర్పాటుకి ముందే.. బౌరంపేట్ సర్వే నెం.524, 525, 567 స్థలంపై "2022 మార్చి నెలలో" ల్యాండ్ యూస్ ఇన్ఫర్మేషన్ కోసం హెచ్ఎండిఏ అధికారులను సంప్రదించారు.. సంబంధిత స్థలం కన్జర్వేషన్ జోన్‌లో ఉందని 2022 మార్చి 5న, మార్చి 7వ తేదీలో, హెచ్ఎండిఏ స్పష్టతను ఇచ్చింది.. మరోవైపు
హెచ్ఎండిఏకి, అనుమతులకు దరఖాస్తు చేసుకున్న "వ్యాసా స్కూల్"కి అనుమతులు తిరస్కరించింది..! అయినప్పటికీ పలుకుబడితో సెక్రటేరియట్ నుండి సిఫార్సులు, చేయించారని ఆరోపణలు వస్తున్నాయి.. ఏ అనుమతులు లేకపోయినా మున్సిపల్, విద్యాశాఖ, ఫైర్ సర్వీస్ అధికారులని మేనేజ్ చేసి స్కూల్ నిర్వహిస్తున్నట్లు స్పష్టమవుతుంది.. ప్రశ్నించిన వారిని మేనేజ్ చేయడమే గాక, వ్యాసా పాఠశాల యాజమాన్యం, కన్జర్వేషన్ జోన్ నుంచి కన్వర్శన్ అయిందని బుకాయించడం విశేషం..



**సభకు వెళ్ళేదారిలో హరీష్‌రావుని కలిసిన నేతలు..**
బౌరంపేట్ నుండి వరంగల్ ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవం వేడుకలకు బయలుదేరిన గులాబీ నేతలు, మాజీ మంత్రి బీఆర్ఎస్ ముఖ్యయనేత హరీష్‌రావును మర్యాదపూర్వకంగా కలిసిన నేతలు కాసేపు ఆయనతో మాట్లాడారు.. అనంతరం బౌరంపేట్ మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి హరీష్‌రావును శాలువాతో సత్కరింఅరు..

ఎలకతుర్తిలో బీఆర్ఎస్ సభా ప్రాంగణంలో కిక్కిరిసిన గులాబీ దండు..



# బౌరంపేట్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలు

మాజీ మంత్రి టి.హరీష్‌రావును మర్యాదపూర్వకంగా కలిసిన, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి..

- ●గులాబీ జెండాను ఎగురవేసిన బౌరంపేట్ బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి..
- ●గులాబీ దళంతో కలిసి ఎల్కతుర్తి సభకు బయలుదేరిన బీఆర్ఎస్ నేతలు..
- ●గండిమైసమ్మ చౌరస్తాలో ఎమ్మెల్సీతో కలిసి జెండా ఎగురవేసిన శ్రీనివాస్ రెడ్డి..
- ●సభకు వెళ్ళే మార్గంలో మాజీ మంత్రి హరీష్‌రావును కలిసిన గులాబీ నేతలు..



గండిమైసమ్మ చౌరస్తాలో ఎమ్మెల్సీ జెండా ఎగురవేసిన కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాస్ రెడ్డి..



**దుండిగల్, పెన్ పవర్, ఏప్రిల్ 27 :** ప్రతీ తెలంగాణ పౌరుడికి అండ ఈ తెలంగాణ జెండానే అంటూ బౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.. బీఆర్ఎస్ పార్టీ 25వ సంవత్సర రజతోత్సవ వేడుకలు.. బౌరంపేట్ లోని పలు కాలనీలలో గులాబీ జెండా ఆవిష్కరించారు.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ మున్సిపాలిటీ పరిధి భౌరంపేట్‌లో, ఇందిరమ్మ కాలనీలో బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకల సందర్భంగా ఆదివారం గులాబీ జెడాను నాయకులు ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా, శ్రీనివాస్ రెడ్డి, పార్టీ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ సాధనకై, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో పార్టీని స్థాపించి అనేక ఆటుపోట్లకు గురయ్యారని, నిర్విరామంగా కృషి చేసి, ఎన్నో పోరాటాలను నడిపించి తెలంగాణను సాధించిన గొప్ప నాయకుడు కేసీఆర్ అంటూ కొనియాడారు.. తెలంగాణను 10 సంవత్సరాలు అభివృద్ధి పథంలో నడిపి, అనేకానేక అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టిన గొప్ప దార్శనికుడు అని కొనియాడారు.. ఏ ప్రాంతీయ పార్టీకి లేని అత్యధిక కార్యకర్తల సంఖ్యా బలం కలిగిన ఏకైక పార్టీ బీఆర్ఎస్ పార్టీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, మరియు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..



బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో గులాబీ జెండా ఎగురవేసిన మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి..

## గండిమైసమ్మలో జెండా ఎగురవేసిన ఎమ్మెల్సీ..

బీఆర్ఎస్ పార్టీ 25 వసంతాల రజతోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ మున్సిపాలిటీ గండిమైసమ్మ చౌరస్తాలో మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభిపూర్ రాజు పార్టీ జెండాను ఆవిష్కరించారు.. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించబోయే బీఆర్ఎస్ పార్టీ సభకు తెలంగాణ ఉద్యమ కారులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ సంఖ్యలో బయలు దేరారు..

# పహల్గాం దాడిలో.. మృతి చెందిన వారకి నివాళులు..

## శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో దీపాల ప్రదర్శన..


## హేయమైన ఉగ్రదాడి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు..



**శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో దీపాల ప్రదర్శన..**

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, ఏప్రిల్ 27:** ప్రతి దేవాలయం తరపున సనాతన ధర్మ రక్షణ దళం ఏర్పాటు అనివార్యమని శ్రీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్ అన్నారు.. పహల్గాంలో జరిగిన హేయమైన ఉగ్రదాడి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.. శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం దీపాలను ప్రదర్శిస్తూ శాంతియుత నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్ మాట్లాడుతూ పహల్గాంలో జరిగిన ఈ పిరికిపంద ఉగ్రదాడికి పాకిస్తానే సూత్రధారి అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.. దేశంలో ఉద్రిక్త పరిస్థితులను సృష్టించేందుకే హిందూ యాత్రికులే లక్ష్యంగా ఉద్దేశపూర్వకంగానే ఉగ్రదాడికి పాల్పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు.. సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ, ప్రజలందరూ ఐక్యంగా ఉండాలని, సంయమనం పాటించాలని ఆయన సూచించారు.. ప్రతి దేవాలయంలో ఆయా దేవతల ప్రీతిరోజున సాయంత్రం పిల్లలు పెద్దలు పాల్గొనేలా బజన, కోలాటం లాంటి కార్యక్రమాలు చేపట్టి దేవాలయాలను ఆధ్యాత్మిక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని ఆయన అర్చక పురోహితులకు సూచించారు.. ప్రతి దేవాలయం తరపున సనాతన ధర్మ రక్షణ దళం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ముఖ్య సలహాదారుడు సర్వేపల్లి రమేష్ కుమార్, సుబ్రహ్మణ్యం స్వామి, హరి రాఘవేంద్ర, గీతా శ్రీధరాచార్యులు, రాచపూడి ప్రభాకర్, హనుమంతరాయ శర్మ, గురజాడ రంగారావు, హైమ శివభాస్కర్, రేఖాజ్యోతి, లక్ష్మీ కుమారి, సుబ్బలక్ష్మి, సూర్యసుందరి, తదితరులు పాల్గొన్నారు..

# రూ.136 కోట్లతో కుమార్తెకు బిల్ గేట్స్ సూపర్ గిఫ్ట్!



**హైదరాబాద్ పెన్ పవర్:** మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు, ప్రపంచ కుబేరుల్లో ఒకరైన బిల్ గేట్స్ తన కుమార్తె జెన్నిఫర్ గేట్స్‌కు భారీ బహుమతి ఇచ్చినట్లు వార్తలు వెలువడ్డాయి. 2018లో జెన్నిఫర్ స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న సందర్భంగా, ఆమెకు 15.82 మిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో సుమారు రూ. 136 కోట్లు) విలువైన గుర్రపుశాలను (హార్స్ ఫామ్) కొనుగోలు చేసి బహుమతిగా ఇచ్చినట్లు న్యూయార్క్ పోస్ట్, ది జర్నల్ న్యూస్ కథనాలు ప్రచురించాయి. ఈ విలాసవంతమైన ఎస్టేట్ న్యూయార్క్‌లోని నార్త్ సేలం, వెస్ట్‌చెస్టర్‌లో ఉంది. సుమారు 124 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ హార్స్ ఫామ్ లో గుర్రపు స్వారీకి అవసరమైన అత్యుత్తమ సౌకర్యాలు ఉన్నాయని సమాచారం. రియల్ ఎస్టేట్ డెవలపర్, డేటన్-హడ్సన్ కార్పొరేషన్ (ప్రస్తుతం టార్గెట్) వారసుడు అయిన డంకన్ డేటన్ నుంచి ఈ ఎస్టేట్‌ను కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఈ కొనుగోలును ఆఫ్-మార్కెట్ డీల్ ద్వారా, గతంలో గేట్స్ కుటుంబం ఫ్లోరిడాలో ఆస్తులు కొనడానికి ఉపయోగించిన వెల్లింగ్‌టన్ ట్రస్ట్ అనే సంస్థ ద్వారా పూర్తి చేసినట్లు సమాచారం. జెన్నిఫర్ గేట్స్ చిన్నప్పటి నుంచి గుర్రపు స్వారీ పట్ల ఎంతో ఆసక్తి కనబరుస్తున్నారు. ఈక్వెస్ట్రియన్‌గా రాణించాలనే లక్ష్యంతో ఉన్నారు. ప్రస్తుతం ఆమె న్యూయార్క్ యూనివర్సిటీలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. ఆమె అభిరుచికి తగ్గట్టుగానే ఈ నార్త్ సేలం ఎస్టేట్‌లో అత్యాధునిక స్టేబుల్స్, శిక్షణా సౌకర్యాలు ఉన్నాయని తెలిసింది. కాగా, బిల్ గేట్స్ గతంలో ఫ్లోరిడాలోని వెల్లింగ్‌టన్‌లో కూడా 38 మిలియన్ డాలర్లతో మరో విలాసవంతమైన ఈక్వెస్ట్రియన్ ఎస్టేట్‌ను కొనుగోలు చేశారు. ఆ ప్రాంతంలో మైఖేల్ బ్లూమ్‌బెర్గ్, బ్రూస్ స్ప్రింగ్‌స్టీన్ వంటి ప్రముఖులు నివసిస్తుంటారు.

అయితే, కుమార్తెకు ఇంతటి ఖరీదైన బహుమతి ఇవ్వడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఎందుకంటే, బిల్ గేట్స్ మాజీ భార్య మెలిండా గేట్స్ గతంలో తమ ముగ్గురు పిల్లలను (జెన్నిఫర్, రోరీ, ఫోబ్) చాలా సాధారణంగా, ఆర్థిక క్రమశిక్షణతో పెంచామని పలు సందర్భాల్లో పేర్కొన్నారు. 2024లో న్యూయార్క్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో, తమ కుటుంబం 'చాలా మధ్యతరగతి' వాతావరణంలో ఉండేదని, డబ్బు తమ పెంపకంలో ప్రధాన పాత్ర పోషించలేదని ఆమె తెలిపారు. "మేము వారికి అడిగినవన్నీ కొనివ్వలేదు," అని చెబుతూ, పిల్లలకు పాకెట్ మనీ ఇచ్చినా, పొదుపు చేయడం నేర్పించామని, దుబారా ఖర్చులను నివారించామని ఆమె వివరించారు. డ్యూక్ యూనివర్సిటీలో తన అనుభవాలను గుర్తుచేసుకుంటూ, "నాకు ఎప్పుడైనా సంపద వస్తే, నా పిల్లలను అలా పెంచకూడదని అప్పుడే నిర్ణయించుకున్నాను" అని మెలిండా వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో, జెన్నిఫర్ గుర్రపు స్వారీ కలను ప్రోత్సహించడానికి బిల్ గేట్స్ ఈ భారీ బహుమతి ఇచ్చినప్పటికీ, పిల్లల పెంపకం విషయంలో మెలిండా చెప్పిన నిరాడంబరత, విలువలకు ఇది పూర్తి భిన్నంగా ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రపంచంలోని అత్యంత సంపన్న కుటుంబాలలో ఒకటైన గేట్స్ కుటుంబంలో సంపదకు, వారు పాటించే విలువల మధ్య ఉన్న సమతుల్యతపై ఈ సంఘటన కొత్త చర్చకు తెరలేపింది.

# లవ్ మ్యారేజి చేసుకుందని కూతుర్ని కాల్చి చంపిన రిటైర్డ్ ఎస్సై

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రేమ వివాహం చేసుకున్న కుమార్తెను కన్నతండ్రే కిరాతకంగా కాల్చి చంపిన దారుణ ఘటన మహారాష్ట్రలో చోటుచేసుకుంది. బంధువుల ఇంట్లో జరుగుతున్న పెళ్లి వేడుకకు భర్తతో కలిసి కుమార్తె హాజరుకాగా, ఈ విషయం తెలుసుకున్న తండ్రి అక్కడికి చేరుకుని విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో యువతి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, ఆమె భర్త గాయపడ్డాడు. జల్గావ్ జిల్లాలో శనివారం రాత్రి ఈ విషాద సంఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. జల్గావ్‌కు చెందిన తృప్తి (24), అవినాష్ వాగ్ (28) ప్రేమించుకున్నారు. పెద్దల అంగీకారంతో నిమిత్తం లేకుండా రెండేళ్ల క్రితం వారిద్దరూ వివాహం చేసుకున్నారు. తృప్తి తండ్రి, రిటైర్డ్ సీఆర్పీఎఫ్ ఎస్ఐ అయిన కిరణ్ మాంగ్లేకు ఈ పెళ్లి ఏమాత్రం ఇష్టం లేదు. అప్పటి నుంచి కూతురు, అల్లుడిపై ఆయన కోపంగా ఉన్నాడు. కాగా, శనివారం రాత్రి చోప్డా పట్టణంలో అవినాష్ సోదరి హల్దీ కార్యక్రమం (పసుపు వేడుక) జరిగింది. ఈ వేడుకకు తృప్తి, అవినాష్ దంపతులు హాజరయ్యారు. ఈ విషయం కిరణ్ మాంగ్లేకు తెలిసింది. దీంతో తీవ్ర ఆగ్రహంతో అక్కడకు చేరుకుని, తన వెంట తెచ్చుకున్న సర్వీస్ రివాల్వర్‌తో కూతురు తృప్తిపై కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో తృప్తి అక్కడికక్కడే కుప్పకూలి ప్రాణాలు విడిచింది. భార్యను కాపాడేందుకు ప్రయత్నించిన అవినాష్ వాగ్ కూడా కాల్పుల్లో గాయపడ్డాడు. కళ్ల ముందే జరిగిన ఈ దారుణాన్ని చూసి పెళ్లి వేడుకకు హాజరైన బంధువులు, అతిథులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. కిరణ్ మాంగ్లేను పట్టుకుని తీవ్రంగా కొట్టారు. ఈ దాడిలో కిరణ్ కూడా తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తృప్తి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాల్పుల్లో గాయపడిన అవినాష్‌ను, అతిథుల దాడిలో గాయపడిన కిరణ్ మాంగ్లేను చికిత్స కోసం జల్గావ్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ దారుణ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

# తెలంగాణ కొత్త సీఎస్‌గా రామకృష్ణారావు.. భారీగా ఐఏఎస్‌ల బదిలీలు.. స్మితా సబర్వాల్‌కు ఏ పోస్ట్ అంటే..

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఐఏఎస్ కె. రామకృష్ణారావును ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా ప్రస్తుతం రామకృష్ణారావు విధుల్లో ఉన్నారు. ఏప్రిల్ 30వ తేదీతో ప్రస్తుత సీఎస్ శాంతి కుమారి పదవీ కాలం ముగుస్తుంది. మే 1వ తేదీ నుంచి ఐఏఎస్ రామకృష్ణారావు తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టనున్నారు. నిజానికి సీనియారిటీ పరంగా కొత్త సీఎస్ రేసులో ఐఏఎస్ అధికారి శశాంక్ గోయల్ ముందున్నప్పటికీ.. ఆర్థిక శాఖలో రామకృష్ణారావుకు ఉన్న సుదీర్ఘ అనుభవం, తెలంగాణ పరిస్థితులపై పూర్తి అవగాహన ఉండడంతో ఆయన వైపు ప్రభుత్వం మొగ్గు చూపింది. బీఆర్ఎస్ హయాంలో రామకృష్ణారావును సీఎస్ పదవి వరిస్తుందని భావించినప్పటికీ దక్కలేదు. రామకృష్ణారావు ఈ ఏడాది ఆగస్టులోనే రిటైర్? అవుతున్నారు. ఆయనను సీఎస్?గా ప్రభుత్వం తీసుకుంది కాబట్టి పదవీ కాలాన్ని పొడిగించే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా తెలంగాణలో భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. ఫైనాన్స్ కమిషన్ మెంబర్ సెక్రటరీగా స్మితా సబర్వాల్, జీహెచ్?ఎంసీ కమిషనర్?గా ఆర్వీ కర్ణన్, జెన్ కో సీఎండీగా ఎస్. హరీశ్ నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. గుడ్ గవర్నెన్స్ వైస్ చైర్మన్ గా శశాంక్ గోయల్, ఇండస్ట్రీ, ఇన్వెస్ట్ మెంట్ సెల్ సీఈవోగా జయేశ్ రంజన్, పరిశ్రమలు, వాణిజ్యం ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సంజయ్ కుమార్, కార్మిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా దానకిషోర్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి (హెచ్ఎండీఏ వెలుపల)- టీకే శ్రీదేవి, హెచ్ఎండీఏ పరిధిలో పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శిగా ఇలంబర్తిని ప్రభుత్వం నియమించింది. ఫ్యూచర్ సిటీ డెవలప్ మెంట్ అథారిటీ కమిషనర్ గా కె. శశాంక్, రాష్ట్ర మానవహక్కుల కమిషన్ సెక్రటరీ, సీఈవోగా నిఖిల, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ గా సంగీత సత్యనారాయణ.. దేవాదాయ శాఖ డైరెక్టర్, యాదగిరిగుట్ట సీఈవోగా ఎస్. వెంకటరావు, నియమితులు కావడం గమనార్హం.

# కాంగ్రెస్ పై నిప్పులు చెరిగిన కేసీఆర్.. దాన్ని నమ్ముకుంటే?

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో అధికార పార్టీ కాంగ్రెస్ పై బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని అన్నారు. ఎల్కతుర్తి సభలో కేసీఆర్ ప్రసంగించారు. తొలుత పహల్గాం ఘటనపై మరణించిన వారికి సభలో సంతాపాన్ని ప్రకటించారు. ఎర్రవెల్లి ఫామ్ హౌస్ నుంచి హెలికాప్టర్ లో చేరుకున్న కేసీఆర్ తొలుత పార్టీ నేతలతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. అనంతరం ఆయన ఏడు గంటల ప్రాంతంలో సభా వేదికపైకి చేరుకున్నారు. ఇరవైఐదేళ్ల నాడు ఎగిరిన గులాబీ జెండాను ఎందరో అవహేళన చేశారని, అవమానించారని, ఈ జెండా ప్రజల సహకారంతో తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చుకోగలిగామని తెలిపారు. తర్వాత ప్రజలు దీవిస్తే అద్భుతమైన తెలంగాణఐు పదేళ్ల పాటు ఏర్పాటు చేసుకున్నామని కేసీఆర్ తెలిపారు. వరంగల్ గడ్డకు ప్రత్యేక ఉందని, పోరు గడ్డ అని అందుకే ఈ నేలకు వందనం చేస్తున్నానని కేసీఆర్ తెలిపారు. విధ్వంసమైన తెలంగాణను అభివృద్ధి పథంలో నడపగలిగామని కేసీఆర్ చెప్పారు. పదవుల కోసమో.. అధికారం కోసమో.. పుట్టలేదు ఈ తెలంగాణ జెండా అని రాష్ట్రం కోసమే పుట్టిందని అన్నారు. తాను ఉద్యమ జెండాను దించితే రాళ్లతో కొట్టి చంపండని మిమ్మల్ని తాను కోరిన విషయాన్ని ఆయన గుర్తుకు తెచ్చారు..

**కోటి ఎకరాలకు నీరు అందించి...**

కరవు కాటకాల తెలంగాణకు నేడు కోటి ఎకరాలకు నీరందించానని కేసీఆర్ తెలిపారు. పదవుల కోసం ఆగం చేసిన వాళ్లు కాంగ్రెస్ నేతలు మాత్రమేనని అన్నారు. తెలంగాణను నాశనం చేసింది నాడైనా, ఈనాడైనా కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని అన్నారు. నాడు తెలంగాణ కోసం తాను పోరాడితే టీడీపీ, కాంగ్రెస్ నేతలు పెదవులు మూశారన్నారు. కాంగ్రెస్ మెడలు వంచి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని తెలిపారు. ప్రాణాలకు తెగించి తాను తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చానని కేసీఆర్ తెలిపారు. సకల జనుల సమ్మె, సాగర హారాలతో పోరాటం చేసిన తర్వాత కాని తెలంగాణ తెచ్చుకున్నామని చెప్పారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు బాధ్యతగా పనిచేశామని కేసీఆర్ చెప్పారు. ఒకప్పుడు వెనకబడిన ప్రాంతమైన తెలంగాణను నెంబర్ వన్ లో నిలబెట్టింది బీఆర్ఎస్ కాదా? అని కేసీఆర్ ప్రశ్నించారు. అనేక ప్రాజెక్టులను నిర్మించుకుని సాగునీరు అందించి మూడున్నర లక్షల టన్నుల వరిని పండించే స్థాయికి వచ్చామని కేసీఆర్ తెలిపారు. మిషన్ కాకతీయ పేరుతో చెరువుల్లో పూడికలు తీసుకున్నామని తెలిపారు. పంజాబ్ ను తలదన్నేవిధంగా తెలంగాణను వ్యవసాయరంగంలో ముందుకు తీసుకెళ్లామని, రైతాంగాన్నిచంకలో పెట్టుకుని చూసుకున్నామని తెలిపారు.



**ఇచ్చిన హామీలు అమలుచేయకుండా...**

రైతు బంధు డబ్బులు సకాలంలో నాడు వేసేవారమన్నారు. రైతుల సంక్షేమం కోసమే తాము పనిచేశామని కేసీఆర్ చెప్పారు. ధాన్యాన్ని కొనుగోలు చేసి అందరు రైతులను ఆదుకున్నామని తెలిపారు. రైతు బంధు, రైతు బీమా, కేసీఆర్ కిట్ కానీ అన్నివర్గాలకు అందచేశామని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి హామీలు ఇవ్వకపోయినా అనేకం ప్రజలకు అందించామని కేసీఆర్ తెలిపారు. ఐటీ రంగంలో ఏడు లక్షల మందికి ఉద్యోగాలు కొత్తగా వచ్చాయని చెప్పారు. తెలంగాణలో ముప్ఫయి మూడు మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేశామని కేసీఆర్ అన్నారు. ఇవన్నీ తాను చెప్పేవి కాదని, మీరే పదేళ్ల పాటు చూశారన్న కేసీఆర్ కాంగ్రెస్ వచ్చి ఏడాదిన్నర తర్వాత ఏం మాయరోగం వచ్చి? వీటిని అమలు చేయలేదని నిలదీశారు. గోల్ మాల్ తిప్పడంలో కాంగ్రెస్ ను మించినవాడు లేడన్నారు. ఉన్న గాంధీలు లేని గాంధీలు దిగి ప్రజలను మభ్యపెట్టారన్నారు. రైతుబంధు పదివేలు కేసీఆర్ ఇస్తే పదిహేను వేలు ఇస్తామని, నాలుగు వేల పింఛను ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ఎటు పోయిందని కేసీఆర్ ఎద్దేవా చేశారు. ఎన్ని మాటలు చెప్పి అధికారంలోకి వచ్చారని కేసీఆర్ సెటైర్ వేశారు. అధికారంలోకి వస్తే తులం బంగారం కూడా ఇస్తామని అన్నారని, ఇస్తున్నారా? అని కేసీఆర్ ప్రశ్నించారు.

**ఇంత ఆగం చేస్తారా?**

పార్లమెంటు ఎన్నికల్లోనూ తెలంగాణలోనూ అందరి దేవుళ్లపై ప్రమాణం చేసి హామీలను అమలు చేస్తున్నామని కేసీఆర్ తెలిపారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు భూముల ధరలు ఎలా ఉన్నాయని, ఇప్పుడు ఎలా ఉన్నాయని ప్రశ్నించారు. తన కళ్లముందే తెలంగాణ ఆగం అవుతుంటే కళ్లవెంట నీళ్లు వస్తున్నాయని కేసీఆర్ అన్నారు. కేసీఆర్ పక్కకు పోయిన వెంటనే ఇంత ఆగమవుతదా? అని ప్రశ్నించారు. కరెంట్ ను ఇరవై నాలుగు గంటలు ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ ది కాదా? అని నిలదీశారు.కేసీఆర్ ఇచ్చిన కరెంట్ కాంగ్రెస్ వాళ్లకు ఎందుకు ఇవ్వడం చేతకాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనిని నెత్తిమీద పెట్టుకున్నట్లయిందన్నారు. మళ్లీ రైతాంగం దోపిడీకి గురవుతుందని, 2014 కు ముందు రోజులు వస్తున్నాయని, ఇది కాంగ్రెస్ అసమర్థత కాదా? అని ప్రశ్నించారు. తాము బుల్ డోజర్లు పెట్టి చెరువు పూడికలు తీస్తే కాంగ్రెస్ ప్రభుత్వం బుల్ డోజర్లు పెట్టి హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చివేస్తుందని ఆవేదన చెందారు. ముందుకు పోవాల్సిన తెలంగాణ వెనక్కుపోతుందని, చాలా బాధ అవుతుందని కేసీఆర్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి పదిహేడు నెలలు అయినా తాను నోరు విప్పింది ప్రభుత్వానికి సమయం ఇవ్వాలనేనని కేసీఆర్ తెలిపారు. ఎవరైనా డబ్బుల కోసం యూనివర్సిటీ భూములను అమ్ముతారని ప్రశ్నించారు.

# హైదరాబాద్‌లో ఫంక్షన్‌కు పోయి నైట్ 2 గంటలకు.. ఆటోలో ఇంటికి వెళుతుండటమే ఈమె చేసిన పాపమా..!



**హైదరాబాద్ పెన్ పవర్:** సికింద్రాబాద్?లో ఆకతాయిల ఆగడాలకు ఒక మహిళ నిండు ప్రాణం బలైపోయింది. వెంటాడుతున్న పోకిరీల బైక్?ను తప్పించబోయి ఆటో బోల్తా కొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బేగంపేట పోలీస్ స్టేషన్ పరిధి బాలంరాయిలో ఓ ఆటోలో ఉన్న మహిళను వెంబడిస్తూ అసభ్యంగా కామెంట్లు చేస్తూ మహిళ వెళుతున్న ఆటోను ఆపే ప్రయత్నం చేశారు ఇద్దరు బైకర్లు. మద్యం మత్తులో ఉండడం, అసభ్యంగా సైగలు చేస్తుండడంతో వారిని తప్పించే ప్రయత్నంలో ఆటో డ్రైవర్ బాలంరాయి సర్కిల్ వద్ద యూ టర్న్ తీసుకోగా, అదుపు తప్పిన ఆటో పోల్?ను ఢీ కొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న కారా?నకు చెందిన జవేరియా రిజ్వానా(47) అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. రిజ్వానా తన కొడుకు మహ్మద్ మాజ్ అహ్మద్(20)..కూతురు ఆయేషా సల్మా(11) తో కలిసి టోలి చౌకిలో జరిగిన ఫంక్షన్?కు హాజరై 24 వ తేదీ రాత్రి రెండు గంటల సమయంలో తిరిగి వస్తుండగా వారిని నల్లగుట్ట ప్రాంతం నుంచి వచ్చిన యువకులు

రెండు బైక్?లతో వెంబడించారు. బైక్?పై వచ్చిన యువకులు మద్యం మత్తులో ఉన్నారని, బూతులు తిడుతూ ఆటోను ఆపే ప్రయత్నం చేశారు.దీంతో ఆటో డ్రైవర్ వారి నుండి తప్పించబోయి బాలంరాయ్ రాయల్ లీ ప్యాలెస్ వద్ద యూ టర్న్ తీసుకోవడంతో ఆటో ఎదురుగా ఉన్న పోల్?ను ఢీకొట్టి పల్టీ కొట్టింది. ఆటో ప్రమాదానికి గురై రిజ్వానా చనిపోయినట్లు ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నల్లగుట్టలో లభ్యమైన సీసీ ఫుటేజ్?ల ఆధారంగా బేగంపేట పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

**ఇందిరమ్మ ఇంటి దరఖాస్తుదారుల్లో..**

# 53% మంది అనర్హులే..

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇందిరమ్మ ఇళ్ల కోసం 'ప్రజాపాలన'లో వచ్చిన మొత్తం దరఖాస్తుల్లో అర్హుల జాబితాను ప్రభుత్వం సిద్ధం చేసింది. ఇళ్ల కోసం మొత్తం 77.18 లక్షల మంది దరఖాస్తు చేయగా.. వీరిలో 36.03 లక్షల (46.7 శాతం) మంది అర్హులని గుర్తించారు. మిగతా 41.15 లక్షల (53.3 శాతం) మందిని అనర్హులుగా తేల్చారు. అనర్హులంతా దారిద్ర్యరేఖ (బీపీఎల్)కు ఎగువన ఉన్నవారేనని నిర్ధారించారు. అర్హులు, అనర్హుల వివరాలను గృహ నిర్మాణశాఖ ఎల్-1, ఎల్-2, ఎల్-3 జాబితాలుగా సిద్ధం చేసి పెట్టుకుంది. దీని ప్రకారమే ప్రతి ఆర్థిక సంవత్సరం నియోజకవర్గానికి 3,500 చొప్పున.. రాష్ట్రంలో ఏటా గరిష్ఠంగా మొత్తం 4.50 లక్షల ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేయనుంది. ఇళ్ల దరఖాస్తుల వివరాలను ఇందిరమ్మ యాప్‌లో నమోదు చేశారు. యాప్‌లో పొందుపరిచిన మార్గదర్శకాల మేరకు అన్ని కోణాల్లో చేసిన సర్వేతో పాటు.. ప్రభుత్వం నిర్వహించిన ఇంటింటి కుటుంబ సర్వే ద్వారా దరఖాస్తుదారులను ఎల్-1, ఎల్-2, ఎల్-3గా విభజించారు. ఎల్-1లో 23.05 లక్షలు, ఎల్-2లో 21.44 లక్షలు, ఎల్-3లో 32.69 లక్షల దరఖాస్తుదారులు ఉన్నట్లు తేల్చారు. ఎల్-1 జాబితాలో సొంత స్థలాలు ఉండి ఇళ్లు లేని వారిని చేర్చారు. సొంత స్థలంలో పూరిళ్లు, మట్టిమిద్దెలు, రేకుల ఇళ్లు ఉన్నవారిని కూడా ఇందులో చేర్చారు. ఎల్-2 జాబితాలో స్థలాలు, ఇళ్లు లేని వారిని చేర్చారు. ఎల్-3 జాబితాలో ప్రభుత్వ ఉద్యోగులు, సొంత ఇళ్లు, కార్లున్నవారు, దారిద్ర్యరేఖ(బీపీఎల్)కు ఎగువన ఉన్నవారు, ఆదాయపుపన్ను చెల్లిస్తున్న వారిని చేర్చారు. వీటి ఆధారంగా గత ఫిబ్రవరిలోనే జాబితాను తయారు చేశారు. పలు ఫిర్యాదులు రావడంతో మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలన ద్వారా అనర్హుల జాబితాను ప్రభుత్వం రూపొందించింది. గ్రామాలు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, పురపాలికల వారీగా ఈ జాబితాను ప్రభుత్వం సిద్ధం చేసి ఉంచింది. దాని ప్రకారం.. ఎల్-3లో 32.69 లక్షల మంది ఉన్నట్లు గృహనిర్మాణశాఖ గుర్తించింది. తాజాగా మరోసారి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టడంతో అనర్హుల సంఖ్య 41.15 లక్షలకు పెరిగింది. నిబంధనల ప్రకారం ఎల్-3 జాబితాలో చేర్చిన వారంతా అనర్హులే. ఎల్-1 జాబితాలో 18.67 లక్షల మంది, ఎల్-2 జాబితాలో 17.36 లక్షల మంది అర్హులుగా తేలారు.

## పెద్దాపురంలో రెచ్చిపోయిన వైఎస్సార్సీపీ - టీడీపీ కార్యకర్తపై కత్తులతో దాడి -

**హైదరాబాద్ పెన్ పవర్:**కాకినాడ జిల్లా పెద్దాపురంలో వైఎస్సార్సీపీ కార్యకర్తలు రెచ్చిపోయారు. టీడీపీ కార్యకర్తపై కత్తులతో దాడికి తెగబడ్డారు. కాకినాడకు చెందిన తోగు జార్జ్ చక్రవర్తి 2010లో పాత పెద్దాపురంలో రెండున్నర ఎకరాల భూమిని కట్టమూరుకు చెందిన బిక్కిన విశ్వేశ్వరరావు వద్ద కొనుగోలు చేసి వరి సాగు చేస్తున్నారు. అయితే ఆ భూమి తమదని, ఓ మహిళతో కొందరు స్థానిక వైఎస్సార్సీపీ కార్యకర్తలు కోర్టులో కేసు వేయించారు. కోర్టులో కేసు నడుస్తున్నప్పటికీ జార్జ్ పొలంలో వరి సాగు చేస్తున్నాడు. శనివారం రాత్రి పొలంలో వరి కోతలు చేయిస్తుండగా పెద్దాపురం వైఎస్సార్సీపీ కార్యకర్తలు వెన్న విజయ చక్రవర్తి, ఆరేల్లి రాఘవ, పెదిరెడ్ల నాని, ఐతి మేరీ, కొత్తపల్లి సాయికుమార్ ఇంకొందరు జార్జ్‌పై కత్తులతో దాడికి పాల్పడ్డారు. తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో ఉన్న జార్జ్‌ని స్థానికులు పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు.
పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కాకినాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వైఎస్సార్సీపీ నేతలు తనపై దాడికి పాల్పడ్డారని ఆసుపత్రిలో జార్జ్ పోలీసులకు వాంగ్మూలం ఇచ్చాడు. ఈ ఘటనపై ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులతో మాట్లాడి దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

# వరంగల్ సభలో భారీ భోజన ఏర్పాట్లు.. నోరూరించే తెలంగాణ వంటకాలతో అంతా సిద్ధం




**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్ రజతోత్సవ సభకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. దాదాపు పది లక్షల మంది ఈ సభకు హాజరవుతారని అంచనా వేసి అందుకు తగిన ఏర్పాట్లు చేశారు. ఏ ఏ నియోజకవర్గాల నుంచి వచ్చే వారు ఏ రూట్లలో రావాల్సింది ముందుగా నిర్ణయించారు. వారికి నిర్దేశించిన రూట్లలోనే రావాలని కోరారు. ప్రత్యేకంగా తయారు చేసిన రూటు మ్యాప్ ప్రకారం నియోజకవర్గాల వారీగా అనుమతించనున్నారు. పది లక్షల మందిని కంట్రోల్ చేయాలంటే మామూలు విషయం కాదు. అందుకే ఏ నియోజకవర్గం నుంచి వచ్చిన కార్యకర్తల బాధ్యత ఆ నియోజకవర్గ ఇన్‌ఛార్జిని అప్పగించారు. వారే దగ్గరుండి అందరూ చూసుకోవాలి. వారిని భద్రంగా ఇంటికి చేర్చేలా చర్యలు తీసుకోవాలి.

**ప్రత్యేకంగా వెయ్యి ఎకరాల్లో...**
తమ ప్రాంతంలో గులాబీ జెండాను ఎగురవేసి మరీ వరంగల్ కు బయలుదేరిన జనానికి అవసరమైన వాహనాలను నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు సమకూర్చారు. అంతటితో ఆగకుండా వాహనాల కోసమే ప్రత్యేకంగా వెయ్యి ఎకరాల కు పైగానే పార్కింగ్ ను ఏర్పాటు చేశారు. గత కొన్ని రోజులుగా కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న నేతలు పార్కింగ్ కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తున్నారు. పార్కింగ్ కూడా ఏ నియోజకవర్గానికి ఆ నియోజకవర్గం వాహనాలు ప్రత్యేకంగా పార్క్ చేయాలని మైకుల్లో వారికి సూచిస్తున్నారు. వాహనాలు ఎండ వేడిమికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. వరంగల్ జిల్లా హనుమకొండలోని ఎల్కతుర్తికి దూరంగానే వాహనాలను పార్కింగ్ చేసి అక్కడి నుంచి సభాస్థలికి వెళ్లాల్సి ఉంటుంది.

**మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లతో...**
ప్రతి వాహనంలో మంచినీటి తో పాటు బిస్కెట్లు, పండ్లు, ఓఆర్ఎస్ పాకెట్లను ఉంచారు. ఎటు నుంచి వచ్చినా ఎక్కడికక్కడ భోజనాల ఏర్పాట్లు చేశారు. తెలంగాణ వంటకాలతో అంతా సిద్ధం చేశారు. వారు వచ్చే సమయంలోనే భోజనం తిని సభాస్థలికి చేరుకోవాల్సి ఉంటుంది. వాహనంలో వచ్చిన వారంతా ఒకేచోట ఉండాలని, తప్పిపోయినా సెల్ సిగ్నల్స్ సభా ప్రాంగణంలో ఉండవని ముందుగానే నిర్వాహకులు తెలిపారు. మొత్తం 154 ఎకరాల్లో సభా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. లక్షల సంఖ్యలో కుర్చీలు వేస్తున్నారు. వేదికపై ఉన్న వారంతా కనిపించేలా ఎక్కడికక్కడ ఎల్ఈడీ స్క్రీన్ లు ఏర్పాటు చేశారు. స్త్రీలు, పురుషులకు వేర్వేరుగా తాత్కాలిక మరుగుదొడ్లను నిర్మించారు. దీంతో పాటు పన్నెండు వైద్య శిబిరాలను ఏర్పాటుచేశారు. వాహనాలు మరమ్మతులకు గురయితే వెంటనే వాటిని తీసుకెళ్లేందుకు టోయింగ్ వాహనాలను కూడా సిద్ధం చేశారు. సభకు వచ్చే వారి కోసం పది లక్షల వాటర్ బాటిల్స్ తో పాటు పదిహేను లక్షల మజ్జిగ బాటల్స్ ను ఏర్పాటు చేశారు. అందరికీ ఆహారం అందేలా ఏర్పాట్లు చేశారు.

# కీలక నిర్ణయం తీసుకున్న టీటీడీ - మే 1 నుంచి సిఫార్సు లేఖల బ్రేక్ దర్శనాలు రద్దు



**హైదరాబాద్ పెన్ పవర్:**వేసవి సెలవుల దృష్ట్యా టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. మే 1 నుంచి తిరుమలలో సిఫార్సు లేఖల బ్రేక్ దర్శనాలను రద్దు చేసింది. జులై 15 వరకు సిఫార్సు లేఖలు అనుమతించబోమని టీటీడీ ప్రకటించింది. ప్రజాప్రతినిధులు, టీటీడీ బోర్డు సభ్యుల సిఫార్సు లేఖలు చెల్లవని టీటీడీ స్పష్టం చేసింది. ప్రోటోకాల్ వీఐపీలకు మాత్రమే బ్రేక్ దర్శనాలు ఉంటాయని టీటీడీ వెల్లడించింది. సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత కల్పించేందుకు సిఫార్సు లేఖలు రద్దు చేసినట్లు టీటీడీ స్పష్టం చేసింది.
వీఐపీ బ్రేక్ దర్శనాల సమయంలో మార్పులు : తిరుమలలో మే 1 నుంచి వీఐపీ బ్రేక్ దర్శనాల సమయంలో టీటీడీ మార్పులు చేసింది. మే 1 నుంచి ఉదయం 6 గంటల నుంచి వీఐపీ బ్రేక్ దర్శనాలు ప్రారంభం అవుతాయని వెల్లడించింది. వేసవి సెలవుల రద్దీ దృష్ట్యా ప్రోటోకాల్ వీఐపీలకు మాత్రమే వీఐపీ దర్శనం కల్పిస్తామని వెల్లడించింది. మే 1 నుంచి జులై 15వ వరకు ఈ నిర్ణయం అమలౌతుందని స్పష్టం చేసింది. సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.
మరోవైపు వేసవి సెలవులు, వారాంత నేపథ్యంలో తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తుల తాకిడి భారీగా పెరిగింది. సర్వదర్శనం టోకెన్ల కోసం వచ్చిన భక్తులతో శ్రీవారిమెట్టు మార్గంలో శనివారం తెల్లవారుజామునుంచే ట్రాఫిక్ స్తంభించింది. చిన్నారులతో వచ్చిన తల్లిదండ్రులు అల్లాడిపోయారు. ఎస్ఎస్డీ టోకెన్ల కోసం క్యూలో ఉన్న భక్తులు ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డారు. నెలల చిన్నారులతో క్యూలైన్‌లో ఉన్న తల్లుల పరిస్థితి వర్ణనాతీతం.
తిరుమలలో టోకెన్లు లేని భక్తులకు సర్వదర్శనానికి 18 గంటల సమయం పడుతోంది. శ్రీనివాసుడిని దర్శించుకునేందుకు 31 కంపార్టుమెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. శనివారం నాడు స్వామివారిని 82,811 మంది భక్తులు దర్శించుకోగా, 34,913 మంది తలనీలాలు సమర్పించారు. నిన్న శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.24 కోట్లు వచ్చింది. మరోవైపు తిరుమలలో పోలీసుల హైఅలర్ట్ కొనసాగుతోంది. నిఘావర్గాల హెచ్చరికలు, ఎస్పీ హర్షవర్ధన్ ఆదేశాలతో చెకింగ్స్ చేపట్టారు. బస్టాండ్లు, హోటళ్లు, మఠాల వద్ద బాంబ్, డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఘాట్ రోడ్లలో పలుచోట్ల వాహనాలను తనిఖీ చేస్తున్నారు.

# సహాయక బృందాలకు సవాల్... మరో ఆప్షన్ లేదా?




**హైదరాబాద్ పెన్ పవర్:**శ్రీశైలం ఎడమ గట్టు సొరంగంలో రెస్క్యూ ఆపరేషన్ కు బ్రేక్ వేయాలని నిర్ణయించడం మృతుల కుటుంబాలకు షాక్ కు గురి చేసింది. అయితే ప్రమాదకరమైన ప్రాంతంలో సహాయక చర్యలు ఎలా చేయాలన్న దానిపై నిపుణుల కమిటీ సలహాలు, సూచనల మేరకు ముందుకు వెళ్లాలని ప్రభుత్వం ఆదేశించినా సాంకేతిక కమిటీ మాత్రం మూడు నెలలు విరామం ప్రకటించాలని నిర్ణయించడం ఆందోళనకు దారితీస్తుంది. మృతదేహాలను వెలికి తీయడం లక్ష్యంగానే పనిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ అసాధ్యం కాకపోవడంతో తాత్కాలిక విరామమే ప్రకటించామని అధికారులు చెబుతున్నారు.

**షీర్ జోన్ ప్రాంతంలో...**

శ్రీశైలం ఎడమ గట్టు సొరంగంలో ప్రమాదం జరిగి 65వ రోజుకు చేరుకుంది. అయితే చివరి యాభై మీటర్ల ప్రాంతంలో బురద, మట్టి, బండరాళ్లను తొలగించడం కూడా కష్టంగా మారింది. దీనిని డీ2 ప్రాంతంగా సహాయక బృందాలు గుర్తించాయి. ఈ షీర్ జోన్ లో ఏ మాత్రం తవ్వకం జరిపితే వెంటనే ప్రమాదం జరిగే అవకాశం ఉందన్న భయం అందరిలోనూ ఉంది. అందుకే సహాయక బృందాలకు ఈ ఆపరేషన్ సవాల్ గా మారింది. ఈ ప్రాంతంలోనే ఆరుగురి మృతదేహాలు ఉండే అవకాశముండటంతో అక్కడ ఏం చేయాలన్న దానిపై నిపుణుల సూచనలు తీసుకుని ముందుకెళ్లాలని నిర్ణయించారు.

**సాంకేతిక కమిటీ...**

అయితే మరొక వైపు సొరంగంలో పనులపై కూడా అధికారులు ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. సొరంగం పనులు ఆపకుండా కొనసాగించి, టన్నెల్ పనులు పూర్తి చేయాలన్న ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం ఉంది. ఇందుకోసం నిపుణుల కమిటీతో పాటు సాంకేతిక కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఈ రెండు కమిటీలు సొరంగంలో పనులు ఎప్పటి నుంచి ప్రారంభించాలి? ఎలా ఎప్పుడు ఎటు నుంచి ప్రారంభించాలన్న దానిపై ఒక నిర్ణయానికి రానున్నారు. తిరిగి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటూ ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. అందుకే తాత్కాలిక విరామాన్ని ప్రకటించినట్లు అధికారులు తెలిపారు.

# నాలాగా వందేళ్లు బతకాలంటే ఇలా చేయండి: ఓ డాక్టర్ చెప్పిన మాట



**హైదరాబాద్ పెన్ పవర్:**ఎక్కువ కాలం ఆరోగ్యంగా జీవించాలనే ఆకాంక్ష అందరిలోనూ ఉంటుంది. దీనికోసం ఆహార నియమాలు, ఒత్తిడి లేని జీవనం వంటి ఎన్నో మార్గాలు అనుసరిస్తుంటాం. అయితే, వందేళ్లకు పైగా ఆరోగ్యంగా జీవించిన ప్రివెంటివ్ మెడిసిన్ నిపుణుడు డాక్టర్ జాన్ షార్ఫెన్‌బర్గ్ (101) దీర్ఘాయుష్షుకు అసలైన రహస్యం వ్యాయామమేనని, అది ఆహారం, ఒత్తిడి నిర్వహణ కంటే కూడా కీలకమని నొక్కి చెబుతున్నారు. ఆయన అనుభవాలు, సూచనలు దీర్ఘాయుష్షుపై కొత్త వెలుగును ప్రసరిస్తున్నాయి.

**వ్యాయామం ప్రాముఖ్యత**

డాక్టర్ షార్ఫెన్‌బర్గ్ ప్రకారం, దీర్ఘాయుష్షుకు అత్యంత ముఖ్యమైన అంశం రోజువారీ శారీరక శ్రమ. ఇది కేవలం బరువు తగ్గడానికో, ఫిట్‌గా ఉండటానికో మాత్రమే కాదు, జీవన ప్రమాణాన్ని పెంచే ప్రాథమిక అవసరం. ఆశ్చర్యకరంగా, సాధారణ బరువు ఉండి శారీరక శ్రమ లేని వ్యక్తి కంటే, కాస్త అధిక బరువు ఉండి కూడా రోజూ చురుగ్గా వ్యాయామం చేసే వ్యక్తి ఎక్కువ కాలం జీవించే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని ఆయన తెలిపారు. అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్ వంటి సమస్యలున్నా, చివరికి పొగతాగే అలవాటు ఉన్నా సరే.. రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేసేవారు, ఎలాంటి చెడు అలవాట్లు లేకపోయినా శారీరకంగా నిష్క్రియంగా ఉండేవారికంటే ఎక్కువ ఆయుష్షు పొందగలరని ఆయన స్పష్టం చేశారు. ఇక్కడ ముఖ్యమైనది జిమ్‌లో గంటల తరబడి చేసే కఠిన వ్యాయామం కాదు, రోజువారీ నిలకడైన 'కదలిక'.

**జీవనశైలి ప్రభావం**

జన్యువులు ఆయుష్షును కొంతమేర నిర్దేశించినా, మనం ఎంచుకునే జీవనశైలే అంతిమంగా ఎక్కువ ప్రభావాన్ని చూపుతుందని డాక్టర్ షార్ఫెన్‌బర్గ్ తన అనుభవంతో చెప్పారు. ఒకే రకమైన జన్యువులున్న తన సోదరుడు భిన్నమైన, శ్రమలేని జీవనశైలి కారణంగా తక్కువ వయసులోనే మరణిస్తే, తాను నిరంతర శారీరక శ్రమ వల్లే వందేళ్లు దాటగలిగానని వివరించారు.

**సంపూర్ణ ఆరోగ్యం**

వ్యాయామం ప్రధానమే అయినప్పటికీ, సంపూర్ణ ఆరోగ్యానికి ఇతర అంశాలు కూడా దోహదం చేస్తాయి. సానుకూల దృక్పథం, ఆనందంగా ఉండటం ఒత్తిడిని తగ్గించి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. "బ్లూ జోన్స్" (ప్రపంచంలో ఎక్కువ కాలం జీవించే ప్రజలున్న ప్రాంతాలు) ప్రజల ఆహారంలో మొక్కల ఆధారిత పదార్థాలు (కూరగాయలు, పండ్లు, గింజలు, పప్పుధాన్యాలు) అధికంగా ఉండటం వారి దీర్ఘాయుష్షుకు ఒక కారణంగా గుర్తించారు. మానసిక ప్రశాంతత, బలమైన సామాజిక సంబంధాలు కూడా ఆయుష్షును పెంచడంలో సహాయపడతాయి.

## బంగారంనేటి ధరలు ఎలా ఉన్నాయంటే.. కొనుగోలుకు ఇదే మంచి సమయం

**హైదరాబాద్ పెన్ పవర్:** బంగారం ధరలు చేతికి చిక్కడం లేదు. అందుబాటులో ఉండకుండా అందకుండా పోయాయి. ఇప్పటికే తులం బంగారం కొనుగోలు చేయాలంటే భారంగా మారింది. అదే సమయంలో వెండి ధరలు కూడా అదే స్థాయిలో పెరుగుతుండటంతో ఇక ఈ రెండు వస్తువులు అపురూపంగా మారే రోజులు కొద్ది రోజుల్లోనే కనిపించనున్నాయన్న అంచనాలు వినపడుతున్నాయి. మొన్నా మధ్య తులం బంగారం లక్ష దాటేసింది. దీంతో బంగారు వ్యాపారుల నుంచి మదుపరుల వరకూ అందరూ కంగారుపడిపోయారు. దీనివల్ల అమ్మకాలు మరింత తగ్గుతాయని భావించారు. అనుకున్నట్లుగానే బంగారం, వెండి అమ్మకాలు గత సీజన్ తో పోలిస్తే దాదాపు అరవై శాతం పడిపోయాయని వ్యాపారులు చెబుతున్నారు.

**పెళ్లిళ్ల సీజన్ కావడంతో...**

మరొకవైపు బంగారాన్ని కొనుగోలు చేయాల్సిన వారు కొందరే ఉన్నారు. పెళ్లిళ్ల సీజన్ కావడంతో మంగళసూత్రానికి బంగారంతో చేయించాల్సి రావడంతో తక్కువలో తక్కువగా చేయించుకుంటూ బంగారంపై సొమ్మును వెచ్చించడానికి ఎవరూ సిద్ధపడటం లేదు. అలాగని ఇతర దేశాల నుంచి బంగారం దిగుమతులు జరగడం లేదా? అంటే అదీ లేదు. దిగుమతులు బాగానే ఉన్నాయి. కానీ ట్రంప్ తీసుకున్న నిర్ణయాలు పుణ్యమా అని బంగారం ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ఇక చైనా, అమెరికా ట్రేడ్ వార్ ప్రభావం కూడా బంగారం, వెండి ధరలపై పడిందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ధరలు ఎంత తగ్గినా ఒక్కసారి పెరిగితే ఇక కొనుగోలు చేయడం కష్టమేనన్న అభిప్రాయానికి వినియోగదారులు వచ్చేశారు.

**నిలకడగా ధరలు...**

బంగారం, వెండి ఇప్పుడు ప్లాటినం ధరలకు మించి పోయాయి. దీంతో ఎక్కువ మంది పెళ్లిళ్లు, పేరంటాలకు గిల్టు నగలతో కనిపిస్తూ వస్తున్నారు. అంతే తప్ప బంగారాన్ని కొనుగోలు చేయడానికి ఎవరూ సాహసించడం లేదు. అంత ధర పెట్టి కొనుగోలు చేయడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో బేరాల కోసం జ్యుయలరీ దుకాణాల యజమానులు ఎదురు చూపులు చూస్తున్నారు. ఈరోజు బంగారం ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. వెండి ధరలు కూడా నిలకడగా ఉన్నాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్ లో బంగారం, వెండి ధరలు ఉదయం ఆరు గంటలకు నమోదయిన ధరల వివరాలు ఇలా ఉన్నాయి. 22 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 90,040 రూపాయలుగా ఉంది. 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 98,230 రూపాయలుగా నమోదయింది. కిలో వెండి ధర 1,10,800 రూపాయలుగా కొనసాగుతుంది.

## మల్లారెడ్డి మాస్ డ్యాన్స్...

**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్ పార్టీ 25వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి ఉత్సాహంగా నృత్యం చేశారు. శామీర్‌పేట్ మండలం అలియాబాద్ చౌరస్తా వద్ద ఆదివారం ఉదయం ఈ దృశ్యం కనిపించింది. వరంగల్‌లో జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలివెళ్లేందుకు సిద్ధమైన నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన స్టెప్పులేసి సందడి చేశారు.వివరాల్లోకి వెళితే, బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వరంగల్‌లో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేశారు. ఈ సభకు హాజరయ్యేందుకు మేడ్చల్ నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అలియాబాద్ చౌరస్తా వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి కాన్వాయ్‌గా వరంగల్ బయలుదేరేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో అక్కడ పండుగ వాతావరణం నెలకొంది.సరిగ్గా అదే సమయానికి అక్కడికి చేరుకున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, పార్టీ శ్రేణుల ఉత్సాహాన్ని చూసి వారితో కలిసిపోయారు. పాటలకు అనుగుణంగా నేతలు, కార్యకర్తలతో కలిసి ఆయన నృత్యం చేశారు. ఎమ్మెల్యే తమతో కలిసి డ్యాన్స్ చేయడంతో కార్యకర్తల్లో జోష్ పెరిగింది. పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా, కీలకమైన వరంగల్ సభకు బయలుదేరే ముందు ఎమ్మెల్యే మల్లారెడ్డి ఇలా పార్టీ కార్యకర్తలతో కలిసిపోయి నృత్యం చేయడం అక్కడున్న వారిని ఆకట్టుకుంది. అనంతరం నేతలు, కార్యకర్తలు వాహనాల్లో వరంగల్ సభకు బయలుదేరి వెళ్లారు.

## ఢిల్లీ మురికివాడల్లో అగ్ని ప్రమాదం..మంటల్లో 800 గుడిసెలు..భయంతో జనం పరుగులు



**హైదరాబాద్ పెన్ పవర్:**దేశ రాజధాని ఢిల్లీలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఆదివారం (ఏప్రిల్ 27) మధ్యాహ్నం రోహిణి ప్రాంతంలోని సెక్టర్ 17లోని శ్రీనికేతన్ అపార్టమెంట్ సమీపంలోని జుగ్గీ మురికివాడల్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు స్థానికులు మృతిచెందారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో అగ్ని ప్రమాదం జరిగింది. సమాచారం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది 20 ఫైరింజన్లతో మంటలార్పేందుకు ప్రయత్నిస్తున్నారు. మంటలు ఎగిసిపడుతుండటంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. జుగ్గీ మురికివాడల్లో దాదాపు 800 గుడిసెలు మంటల్లో చిక్కుకున్నాయి. 100 కు పైగా గుడిసెలు కాలి బుడిదయ్యాయి. స్థానికుల చెందిన డబ్బులు, బంగారు , రిక్షాలు, ఇళ్లలో సామాగ్రి అంతా కాలిపోయింది. మరోవైపు ఢిల్లీలో షకర్‌పూర్ పోలీస్ స్టేషన్ ప్రాంత పరిధిలోని ఐటిఓ ప్రాంతానికి సమీపంలో ఉన్న అడవిలో కూడా అగ్ని ప్రమాదం జరిగింది. ఈ అగ్నిప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని ఢిల్లీ అగ్నిమాపక విభాగం అధికారులు తెలిపారు. అగ్ని ప్రమాదానికి పెరుగుతున్న రోజువారీ ఉష్ణోగ్రతలే కారణమయి ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. గత మూడు రోజులుగా ఢిల్లీలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. మూడేళ్లలో ఏప్రిల్ నెలలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఇదే మొదటిసారి. ఆదివారం ఢిల్లీలో 42.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు అయ్యిందని భారత వాతావరణ శాఖ తెలిపింది. రాబోయే రోజుల్లో ఢిల్లీలో మరింత ఉష్ణోగ్రత పెరిగే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది.

## రంగారెడ్డి జిల్లాలో ఈ హోం గార్డు.. గుండెపోటుతో చనిపోయిండు.. హార్ట్ అటాక్‌కు ముందు ఏం జరిగిందంటే..

**హైదరాబాద్ పెన్ పవర్:**గుండె పోటుతో హోం గార్డు మృతి చెందాడు. రంగా రెడ్డి జిల్లా యాచారం మండలం గున్ గల్‌కు చెందిన రాచకొండ కమిషనరేట్ పరిధిలో అంబర్ పేట్ హెడ్ క్వార్టర్స్?లో హోం గార్డుగా విధులు నిర్వహించే వెంకటేష్(35), ఇంటి ప్రక్కన ఉన్న వారితో స్థల వివాదం నెలకొనడంతో ఇరువర్గాలు ఘర్షణ పడ్డారు. అనంతరం వెంకటేష్(35) యాచారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి బయటకు వచ్చి ఒక్కసారిగా కుప్పకులాడు. వెంటనే అప్రమత్తమైన కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలిస్తుండగా దారిలోనే ప్రాణం పోయింది. ఈ మధ్య గుండె పోట్లు ఆందోళన కలిగిస్తున్నాయి. వయస్సుతో సంబంధం లేకుండా హార్ట్ ఎటాక్స్ వస్తున్నాయి. ఛాతిలో నొప్పితో చూస్తుండగానే కుప్పకూలిపోతున్నారు. క్షణాల్లో ప్రాణం విడిస్తున్నారు. ఈ మధ్య కాలంలోనే తెలుగు రాష్ట్రాల్లో చాలా మంది గుండెపోటుతో చనిపోయారు. ఎలాంటి అనారోగ్య సమస్యలు లేని వారు కూడా హార్ట్ ఎటాక్‌తో సడెన్‌గా మరణిస్తున్నారు. అప్పటివరకు ఎంతో హెల్తీగా ఉన్న వారు ఉన్నట్టుండి కుప్పకూలుతున్నారు. ఏం జరిగిందో తెలుసుకునేలోపు గుండెపోటు కారణంగా ప్రాణాలు వదులుతున్నారు. గతంలో 50 ఏళ్లు దాటినవారిలో ఎక్కువగా గుండెపోటు మరణాలు చూసేవాళ్లం. కరోనా తర్వాత చిన్నా పెద్దా తేడా లేకుండా గుండెపోట్లు వస్తున్నాయి. హృద్రోగ సంబంధిత సమస్యల కుటుంబ చరిత్ర కలిగిన వారికి ఈ ముప్పు అధికంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

## ఎల్కతుర్తికి చేరుకున్న కేసీఆర్... ఎటు చూసినా గులాబీమయం



**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు వరంగల్ సమీపంలోని ఎల్కతుర్తిలో ఏర్పాటు చేసిన పార్టీ రజతోత్సవ సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఆదివారం సాయంత్రం ఆయన ప్రత్యేక హెలికాప్టర్‌లో సభా స్థలికి విచ్చేశారు. హెలికాప్టర్ ల్యాండ్ అయిన వెంటనే పార్టీ నేతలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డితో పాటు పలువురు ముఖ్య నేతలు కేసీఆర్‌ను వేదిక వద్దకు ఆహ్వానించారు.

హెలికాప్టర్‌లో ఉండగానే కేసీఆర్ కిందకు చూస్తూ సభకు హాజరైన ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు అభివాదం తెలిపారు. ఆయన్ను చూసేందుకు సభా ప్రాంగణంలో పెద్ద ఎత్తున గుమిగూడిన ప్రజలు, కార్యకర్తలు ఉత్సాహం ప్రదర్శించారు. 'జై కేసీఆర్', 'జై తెలంగాణ' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ తమ మద్దతును తెలియజేశారు. గులాబీ జెండాలు రెపరెపలాడిస్తూ తమ నాయకుడికి స్వాగతం పలికారు.

బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ సభకు ప్రజలు, పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. సభా ప్రాంగణం జనసంద్రంగా మారింది. వేదికకు కిలోమీటర్ల దూరం వరకు ప్రజలు బారులు తీరిన దృశ్యాలు కనిపించాయి. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కళాకారులు తమ ఆటపాటలతో సభకు వచ్చిన వారిలో ఉత్సాహం నింపారు. తెలంగాణ పాటలకు అనుగుణంగా పలువురు కార్యకర్తలు, ప్రజలు నృత్యాలు చేస్తూ కనిపించారు. మొత్తం మీద సభా ప్రాంగణం సందడిగా, ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగుతోంది.

# బయటకు రాలేము.. ఇంట్లో ఉండలేము.. తెలుగు రాష్ట్రాల్లో పెనం మీదున్నట్లుందిగా




**హైదరాబాద్ పెన్ పవర్:**రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎండలు దంచి కొడుతున్నాయి. అయితే వర్షం పడుతుందని చెప్పినా కొన్ని ప్రాంతాల్లోనే అలా జల్లులు కురిసి వెళ్లిపోతుండటంతో ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతున్నాయని అమరావతి వాతావరణ శాఖ తెలిపింది. కేవలం ఎండల తీవ్రత మాత్రమే కాదు వడగాల్పుల తీవ్రత కూడా అత్యధికంగా ఉంటుందని చెప్పింది. ఆదివారం కూడా పదిహేడు మండలాల్లో వడగాలులు వీస్తాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సాధ్యమయినంత వరకూ ఉదయం పదకొండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ బయటకు రాకపోవడమే మంచిదని సూచిస్తున్నారు. ఇప్పటికే అనేక జిల్లాల్లో తీవ్రమైన వడగాలులు వీస్తాయని వడదెబ్బ తగిలే అవకాశముందని కూడా పేర్కొంది.

### డీహైడ్రేషన్ కు లోను కాకుండా...

అత్యధికంగా కడప జిల్లాలో 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయినట్లు వాతావరణ శాఖ తెలిపింది. వేసవి తీవ్రత రానున్న రోజుల్లో మరింత పెరగనుందని కూడా వాతావరణ శాఖ పేర్కొంది. అయితే కొన్నిచోట్ల పిడుగులు పడే అవకాశముందని, ఎవరూ పొలాల్లో చెట్ల కింద నిలబడవద్దని కూడా ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడే వారు ఎవరూ బయటకు రాకుండా ఇంట్లోనే ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, డీ హైడ్రేషన్ కు లోను కాకుండా రోజుకు నాలుగు నుంచి ఐదు లీటర్ల నీటిని తాగాలని కూడా వైద్యులు సూచిస్తున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే ఇకమే నెలలో సూర్యుడు చెలరేగిపోతాడని ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు.

### 45 డిగ్రీలు దాటడంతో...

తెలంగాణలోనూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. గతంలో ఎన్నడూ లేని విధంగా భారీగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇప్పటికే అనేక జిల్లాల్లో నలభై ఐదు డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తుంది. జగిత్యాల, నిర్మల్, మంచిర్యాల, నిజామాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్జిల్లాల్లో ఉష్ణోగ్రతలు నలభై ఐదు డిగ్రీలు దాటడంతో ప్రజలు పెనంపై ఉన్నట్లు ఫీలవుతున్నారు. ఈ ఆరు జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ జారీ చేసింది. మిగిలిన ఇరవై ఏడు జిల్లాల్లో ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఎండలతో పాటు వడగాలుల తీవ్రత కూడా రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించిది. ఈ నెల 29వ తేదీ వరకూ వడగాల్పులు ఉంటాయని చెప్పింది.